క్లుప్తంగా

ఆరిజిన్ డెయిరీ డైరెక్టర్లపై ఫిర్యాదు



బెల్లంపల్లి: ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి/మందమర్రిరూరల్: ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని తెలంగాణ నేతకాని మహార్ సంక్షేమ సంఘం, నేతకాని మహార్ విద్యార్థి సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ఆరిజిన్ డెయిరీ భాగస్వాములు ఆదినారాయణ, శేజల్‌పై బెల్లంపల్లి వన్‌టౌన్‌లో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్యకు, మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యేపై నిరాధారణమైన విమర్శలు చేస్తున్న ఆదినారాయణ, మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లిలో నేతకాని మహార్ సంఘ నాయకులు గోమాసరాజం, నర్సయ్య, గోపాల్, సురేష్, వాసుదేవ్, భీమయ్య, శ్రీనివాస్, తిరుపతి, విశ్వనాథ్, జువ్వాజీ, ప్రభాకర్, విద్యార్థిసంఘ నాయకులు పాల్గొనగా, మందమర్రిలో సంఘం జిల్లా ఇన్‌చార్జి రాంబాబు, తిరుపతి, ప్రభాకర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



మంచిర్యాలఅర్బన్: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన తాండూర్ విద్యాభారతి పాఠశాల విద్యార్థులు అభినవ్, సాయి వర్ణనను సోమవారం మంచిర్యాల డీఈవో కార్యాలయంలో విద్యాశాఖాధికారి యాదయ్య సన్మానించారు. పదోతరగతిలో 10 జీపీఏ సాధించినందుకు విద్యార్థులను అభినందించారు.

'పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు'

భీమిని: పల్లెల్లో పారిశుద్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో ఫణీందర్ అన్నారు. మండలంలోని ఖర్జీభీంపూర్‌లో సోమవారం శానిటేషన్ పనులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్తాచెదారం ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంటన ఎంపీవో సఫ్దర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

మంచిర్యాలటౌన్: జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు సోమవారం జిల్లా కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో నిర్వహించగా, కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీని రాష్ట్ర ఎన్నికల అధికారి వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా పెరుమాండ్ల శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జి.కనకయ్య, కోశాధికారిగా బి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా రామచందర్, వి.లింగం, ఏ.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలుగా కొండు సత్తయ్య, జి.మాధవరెడ్డి, కె.జనార్దన్, ఆర్గనైజ్ సెక్రటరీగా అలిశెట్టి లక్ష్మణ్, ఈసీ మెంబర్లు గుర్రం గంగన్న, చంద్రశేఖర్, భక్తవర్మకాన్‌లను ఎన్నుకున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ సల్పాల వాగు పర్యాటక, అటవీ ప్రాంతంలో ఓరియంట్ ఉద్యోగులు సోమవారం ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రప్రభుత్వం మిషన్ లైఫ్ మూమెంట్‌లో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ వారి ఆదేశాల మేరకు కంపెనీలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

అంబలి పోస్తూ.. ఆకలి తీరుస్తూ



అంబలి తాగుతున్న ప్రయాణికులు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన వనపర్తి రవి, తన తండ్రి భూమయ్య జ్ఞాపకార్థం, లక్సెట్టిపేట–నిర్మల్ రహదారి పక్కన నెల్కి వెంకటాపూర్ సమీపంలో ఏడేళ్లుగా, వేసవిలో ఉచిత అంబలి కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. రహదారి వెంట వచ్చిపోయే వాహనదారులు, పలువురు ప్రయాణికులు అంబలి ఆకలి తీర్చుకుంటున్నారు.

చిత్తపూర్‌లో అంబలి కేంద్రం ఏర్పాటు

నెన్నెల: మండలంలోని చిత్తపూర్ బస్టాండ్‌లో సోమవారం సర్పంచ్ పద్మ ఆధ్వర్యంలో అంబలి కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, వృద్ధులు, బాటసారులకు బాసటగా నిలువాలనే ఉద్దేశంతో, ప్రతి సంవత్సరం అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



భీమారం: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

దండేపల్లి: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ప్రకాశ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో రెండు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. దండేపల్లిలో పల్లెదవాఖాన భవన నిర్మాణానికి, నిరుపయోగంగా ఉన్న ఫారెస్ట్ క్వార్టర్స్ స్థలాన్ని కేటాయించాలని నటరత్న యూత్ అధ్యక్షుడు మహేష్ వినతిపత్రం అందించారు. రేషన్ కార్డులో పేర్లు తొలగించాలని కోరుతూ మరో అర్జి వచ్చినట్లు పేర్కొన్నారు.

'ప్రజావాణిని ప్రజల్లోకి తీసుకెళ్తాం'

భీమారం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణిపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన మాట్లాడుతూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలు వారి సమస్యలు తెలిపేందుకు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల వారీగా ప్రజలను చైతన్య పర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో టి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని సోమనపల్లిలో మిషన్ భగీరథ నీరు రావడంలేదని, ఒకటి ముత్తరావుపల్లిలో రెవెన్యూ సమస్యపై ఒక ఫిర్యాదు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'నిధుల దుర్వినియోగంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు'

బెల్లంపల్లి: మండలంలోని చంద్రవెల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ బెల్లంపల్లి మండల అధ్యక్షుడు గజెల్లి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 2014–15సంవత్సరంలో అప్పటి సర్పంచ్ గ్రామ పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా బీఆర్‌జీఎఫ్ నిధులు రూ.6.50లక్షలు కాజేశారని పేర్కొన్నారు. తనభర్త పేరుపై అడ్వాన్స్ పేరుతో ఆ డబ్బులు పలు దఫాలుగా డ్రా చేసి సర్పంచ్ అధికారాలను దుర్వినియోగం చేశారని తెలిపారు. ఆర్‌టీఐ ద్వారా సమాచారం తీసుకోగా గ్రామ పంచాయతీ నిధుల స్వాహా వెలుగు చూసిందని వివరించారు. పంచాయతీ నిధులను దుర్వినియోగపరిచిన సర్పంచ్, సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకుని వడ్డీతో సహా రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు చెందిన 12అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. గ్రీవెన్స్ సెల్‌లో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమిని: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో ఫణీందర్, ఎంపీడీవో రాధాకృష్ణ అన్నారు. భీమిని, కన్నెపెల్లి మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణికి నీటి సమస్య, విద్యుత్ దీపాలకు సంబంధించిన సమస్యలపై వినతులు రాగా, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



బెల్లంపల్లి: ఫిర్యాదు చేస్తున్న రాజ్‌కుమార్



దండేపల్లి: అర్జీ అందిస్తున్న యూత్ నాయకుడు



చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో...

పిచ్చిమొక్కలు తొలగించండి..! — అటెన్షన్ ప్లీజ్..



లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి అంబేడ్కర్ చౌరస్తా వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకుని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తను శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: విద్యుత్‌శాఖ ఏఈ గణేశ్ ఫోన్ నంబర్ : 9440811717

ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మహిళకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: ప్రజాసంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్, గ్రామీణ ప్రాంత కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులు 44మందికి ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద ఆడ బిడ్డల పెళ్లికి చేదోడుగా ఉండాలనే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి పథకం సీఎం ప్రారంభించారన్నారు. ఆడ బిడ్డలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ ఎంపీపీ రాణి, తహసీల్దార్ మధుసూదన్, మున్సిపల్ కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, శ్రీనివాస్, రమేష్, కృష్ణ, అశోక్ గౌడ్, ఎంపీటీసీ సుభాష్‌రావు, సర్పంచ్‌లు కృష్ణమూర్తి, రంజిత, అశోక్, బీఆర్‌ఎస్ శ్రేణులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మన పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్: మన రాష్ట్రంలో అమలవుతున్న ప్రజాసంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సోమవారం ఆయన పర్యటించి కాలనీ వాసుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా దీవించాలన్నారు. అనంతరం కాలనీవాసులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, వీధిదీపాలు పనిచేయడం లేదని, పారిశుధ్య సమస్య మెరుగుపర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యంతో, మున్సిపల్ అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్ వంగ తిరుపతి, టీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, పట్టణ కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు సంతోశచారి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

జైపూర్/చెన్నూర్/భీమారం: వ్యాపారులు రైతులకు నాణ్యమైన పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయించాలని స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారి తిరుపతి, సీడ్ సర్టిఫికేషన్ అధికారి శంకరయ్య అన్నారు. పలు మండల కేంద్రాల్లో ఫర్టిలైజర్స్ షాపుల్లో సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్‌బుక్స్, రిజిస్టర్ల నిర్వహణపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేసి విత్తనాల నాణ్యతను రాపిడ్ టెస్ట్‌ల ద్వారా పరీక్షించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. గోదాముల్లో విత్తనాలను, ఎరువుల స్టాక్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ లచ్చన్న, చెన్నూర్ డివిజన్ ఏడీఏ బాపు, వ్యవసాయ శాఖ అధికారి మార్క్‌గ్లాస్టన్, జైపూర్ ఎస్సై ఉపేందర్, టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం పాల్గొన్నారు.

ఇంటింటా సీపీఐ పాదయాత్ర

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో ఇంటింటా పాదయాత్ర సాగింది. ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్ మున్సిపాలిటీలోని పదో వార్డు పెద్దనపల్లి బస్తీ, కొత్త గుడిసెలలో పాదయాత్ర చేశారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాది

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నెలకొన్న ధరణి సమస్యలపై అధ్యయనం చేసినట్లు, రైతుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాదిక్ అలీ మాట్లాడుతూ.. జిల్లాలోని రెండు మండలాల్లో రైతులు ధరణి ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలు, సూచనలు తెలుసుకున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కేజీబీవీ, యూఆర్‌ఎస్ పాఠశాలల ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గొల్ల రామన్న, గుర్రాల రాజావేణు ఆగచారి, జిల్లా కార్యదర్శి దేవదాస్, కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉపాధ్యాయులు సంతోష్, సుజాత, స్వర్ణలత, పల్లవి, శోభరాణి, శేఖర్, సాయికుమార్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళి

పాతమంచిర్యాల: తెలంగాణ దళిత వైతాళికుడు, ధ్రువతార మాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతిని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి మధుకర్, జిల్లా అధ్యక్షుడు రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

'తడకలు అమ్ముకునేందుకు అనుమతివ్వాలి'



మాట్లాడుతున్న గిరిజనులు

జన్నారం: అడవిలో ఉంటూ అటవీ ఉత్పత్తులతో జీవిస్తున్న మాకు ఆంక్షలు సడలించి, తడకలు అమ్ముకోవడానికి అటవీశాఖ అధికారులు అనుమతివ్వాలని మండలంలోని దొంగపల్లి, అలీనగర్‌కు చెందిన గిరిజనులు కుర్ర ఎల్లవ్వ, పోశం శంకరయ్య, పట్టిపు ఎల్లయ్య, కుంటేల రాజన్న వేడుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని అటవీ డివిజనల్ అధికారి కార్యాలయానికి వెళ్లగా, ఎఫ్‌డీవో అందుబాటులో లేకపోవడంతో అనంతరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సంవత్సరాల కాలంగా తడకలు అల్లుకుని జీవిస్తున్నామని, ఇప్పుడు టైగర్‌జోన్ పేరిట అమ్ముకోవడానికి అటవీ శాఖ అధికారులు అనుమతివ్వడం లేదన్నారు. దానిపైనే ఆధారపడి జీవించే మాకు, అమ్ముకోవడానికి అనుమతివ్వాలని కోరారు. ఈ విషయంపై ఎఫ్‌డీవో మాధవరావుతో మాట్లాడగా.. కొన్ని తడకలు అమ్ముకుంటే అభ్యంతరం లేదని, ఎక్కువగా చేసుకుని వాహనాల ద్వారా తరలించొద్దని చెప్పారు.

గనులపై ఏఐటీయూసీ సంబురాలు



ఆర్కే 7 గనిపై టపాసులు కాలుస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం సాధించడంపై ఏఐటీయూసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. 11వ వేతన ఒప్పంద చర్చలు సఫలమై కార్మికులకు వేతనాలు అనుకున్నంత పెరగడంతో గనులపై ఆ యూనియన్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. శ్రీరాంపూర్‌లోని అన్ని గనులపై సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు టపాసులు కాలుస్తూ సంబురాలు చేసుకున్నారు. ఎస్సార్పీ ఓసీపీపై ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఆర్కే 6గనిపై కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య పాల్గొని ప్రసంగించారు. వేరువేరుగా ఆయా గనులపై జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీ కొట్టె కిషన్‌రావు, ఎం.కొమురయ్య, నాయకులు చంద్రమోహన్, మోహన్‌రెడ్డి, మురళీచౌదరీ, నర్సింగరావు, ప్రసాద్ రెడ్డి, సారయ్య పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: 11వ వేజ్‌బోర్డ్‌లో మెరుగైన వేతన ఒప్పందం సాధించుకున్నామని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పేర్కొన్నారు. ఏరియాలోని కేకే–5 గనిపై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వల్ల వేజ్‌బోర్డ్ ఒప్పందం 23నెలలు ఆలస్యమైందని, నూతన వేతనాలు జూలై నుంచి చెల్లిస్తారని వివరించారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: జూన్ 2న ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సింగరేణి సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు యశోద తెలిపారు. ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో సోమవారం సేవా సమితి బృందంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవిర్భావ దినోత్సవం రోజు నిర్వహించే కార్యక్రమ వివరాలు చర్చించారు. ఈ నెల 27న మహిళలకు ఆటల పోటీల్లో భాగంగా ఇల్లందు క్లబ్‌లో గ్రూపు డ్యాన్స్ ఉంటుందని, ఆవిర్భావ దినోత్సవం రోజు సింగరేణి హైస్కూల్ మైదానంలో పలు స్టాల్స్ ఏర్పాటు, ముగ్గుల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆమె వెంట సీనియర్ పీవో, కమ్యూనికేషన్ సెల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ మైత్రేయబంధు, సేవ సమితి, లేడీస్ క్లబ్ సభ్యులు కవిత భూశంకరయ్య, ఫ్యాకలీలు, యోగా సభ్యులు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న గని మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలిద్దామని ఆర్కే 6గని మేనేజర్ ఈ. తిరుపతి తెలిపారు. గనిపై సోమవారం నిర్వహించిన ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మానవాళికి స్వచ్ఛమైన ప్రకృతిని అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. దీనికోసం కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, డెప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, పిట్ ఇంజినీర్ శ్యాంకుమార్, సంక్షేమ అధికారి సునిల్‌కుమార్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ నాయకులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

బీఎంఎస్ ధర్నా

శ్రీరాంపూర్: స్థానిక జీఎం కార్యాలయం ఎదుట బీఎంఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. బొగ్గు గనుల్లో కార్మికుల రక్షణ, చట్టాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీజీఎంఎస్ వైఖరికి నిరసనగా ఆ యూనియన్ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం ఏరియా జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ బ్రాంచీ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, కేంద్ర కమిటీ నాయకులు కాశెట్టి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ కొందరు అధికారులు కంపెనీల అధికారులతో కుమ్మక్కై, రక్షణ చర్యలు పట్టించుకోవడం లేదని, చట్టాలను ఉల్లంఘిస్తూ కార్మికుల ప్రాణాలు తీస్తున్న యాజమాన్యాలపై కూడా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆ శాఖలో అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామగిరి పురుషోత్తమాచారీ, పాగిడ శ్రీకాంత్, బొడిగే చంద్రశేఖర్, మంద కమలాకర్, చల్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

26న క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న సింగరేణి ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముధాయ్‌లో మహిళలకు, పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో, 29న జీఎం కార్యాలయం వద్ద కార్యాలయంలో పని చేసే మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు జూన్ 2న ప్రగతి మైదానంలో జరిగే వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

సంక్షిప్త వార్తలు

జిల్లా అధ్యక్షుడిగా శేఖర్

బెల్లంపల్లి: తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా బెల్లంపల్లికి చెందిన ఆరకొండ శేఖర్ ఎన్నికయ్యారు. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మంద రజినీకాంత్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొరాల్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా ఎండీ జాఫర్‌ను నియమించినట్లు ఆ సంఘం కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి బొంకూరి సురేందర్ సన్నీ ప్రకటించారు.

నస్పూర్ విద్యార్థినికి ఐఐఎంలో సీటు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీకి చెందిన కోడెం రవికుమార్–సుజాత దంపతుల కుమార్తె కోడెం వర్షిణి జమ్మూ కశ్మీర్‌లోని ఐఐఎం(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)లో సీటు సాధించింది.

వినతిపత్రం అందజేత

పాతమంచిర్యాల: న్యాయ వ్యవస్థను జనప్రియంగా మార్చడానికి బార్ అసోసియేషన్ కృషి చేయాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతే రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, ప్రధాన కార్యదర్శి రంగు మల్లేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ముల్కల కనకయ్య, మాధవి, రవికుమార్ పాల్గొన్నారు.

దుకాణదారులకు జరిమానా

తాండూర్: రోడ్డుపై నిర్లక్ష్యంగా చెత్త పడేసిన దుకాణదారులకు గ్రామపంచాయతీ అధికారులు సోమవారం జరిమానా విధించారు. ఐబీ కేంద్రంలో ఉన్న పలు దుకాణదారులు షాపుల్లోని పేపర్, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఇష్టారాజ్యంగా రోడ్డుపై వేయడంతో జరిమానా విధించి, రశీదులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శి తపాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జైపూర్: గ్రూపు–4 పరీక్ష నిర్వహణ కేంద్రాలను సోమవారం మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో రాధాకృష్ణమూర్తి పరిశీలించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నస్పూర్: రాష్ట్రంలోని పలు కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తూ పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌చారి, పట్టణ అధ్యక్షుడు సురేంద్రచారి, కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు జగదీశ్వరచారి, సభ్యులు పాల్గొన్నారు.